వరంగల్ రిజిస్ట్రారుగా ఫణిదర్

కాజీపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రిజిస్ట్రార్‌గా ఫణిదర్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొందరిని మళ్లీ బదిలీలు చేసింది. అందులో భాగంగా హైదరాబాదు ఐజీ కార్యాలయం ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న ఫణిధర్ వరంగల్‌కు రానున్నారు. ఆదిలాబాద్‌కు చెందిన ఈయన 1988 గ్రూపు-2 అధికారిగా ఉద్యోగంలో చేరారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు జిల్లాల రిజిస్ట్రారుగా చేసిన అనుభవం ఉంది. సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి రిజిస్ట్రారు సుభాషిని నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

గ్రేటర్‌లో నేడు ప్రజావాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కమిషనర్ డా.అశ్వినీ తానాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వింగ్ అధికారులు గత గ్రీవెన్స్ పెండింగ్, పరిష్కార వివరాలతో హాజరుకావాలని కోరారు.

భద్రకాళికి 'ఈట్-రైట్' ధ్రువపత్రం

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవస్థానానికి రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ సంస్థ 'ఈట్-రైట్' ధ్రువపత్రం జారీ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా దానిని ప్రదానం చేయనున్నారు. అయిదురోజుల క్రితం జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి భద్రకాళి ఆలయంలో తయారు చేసిన ప్రసాదాల నమూనాలు తీసుకెళ్లి, హైదరాబాద్‌లోని ప్రయోగశాలలో పరీక్షలు చేయించారు. నాణ్యతా ప్రమాణాలు బాగుండటంతో 'ఈట్- రైట్' ధ్రువపత్రం అందించారు. ఇది 2024 ఫిబ్రవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు వర్తించనుంది.

ప్రాణాలను రక్షించే ప్రక్రియ సీపీఆర్

ఎంజీఎం అనువర్తి, న్యూస్‌టుడే: శ్వాస, హృదయ స్పందన ఆగిపోయినప్పుడు అత్యవసరంగా ప్రాణాలను రక్షించే ప్రక్రియ సీపీఆర్ (ఛాతీ మర్దన)పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వరంగల్ కాకతీయ వైద్య కళాశాలలోని ఎన్ఆర్ఐ భవన్‌లో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దీనిపై కమ్యూనిటీ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మరో అతిథి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డా.కాళీ ప్రసాదరావు మాట్లాడుతూ.. అవగాహన కార్యక్రమం చేపట్టిన శ్రీనివాస హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ డా.రామాక శ్రీనివాస్‌ను అభినందించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు సీపీఆర్, డిఫిబ్రిలేటర్ (షాకింగ్)లపై వాకర్స్, పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఎన్సీసీ క్యాడెట్లు, నర్సింగ్ విద్యార్థులు, పోలీసు, సాధారణ ప్రజలకు అవగాహన కల్పించారు. సమర్థంగా సీపీఆర్ నిర్వహించిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వరంగల్ డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.అన్వర్‌మియా, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వరంగల్ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ డా.రవీందర్, ప్రాంతీయ సమన్వయకర్త కిషన్, కేయూ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సదానందం పాల్గొన్నారు.

సీపీఆర్ చేస్తున్న ఎంపీ డా. కడియం కావ్య, చిత్రంలో వైద్యాధికారులు

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

భీమారం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుల్లో రాణిస్తూనే క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. కేయూ పరిధిలోని అంతర్ కళాశాలల పురుషుల రెండ్రోజుల క్రీడా పోటీలు ఆదివారం హసన్‌పర్తి మండలం భీమారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ప్రారంభం అయ్యాయి. రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 34 కళాశాలల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరయ్యారు. టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ప్రొఫెసర్ వై.వెంకయ్య, కిట్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పింగిలి రమేశ్‌రెడ్డి, కేయూ ఫిజికల్ డైరెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, ఏటీబీటీ ప్రసాద్, కె.సునీల్ రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, మహేశ్, నాగరాజు, డి.ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

బెలూన్లు ఎగురవేసి టోర్నీని ప్రారంభిస్తున్న కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, కిట్స్ ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి, పి.రమేశ్‌రెడ్డి తదితరులు

(c) eenadu

జీవితాలు కూల్చుతా!!

మత్తులో 'ముంచుతా'..

నేను గంజాయిని.. సమాజాన్ని పీడిస్తున్న మహమ్మారిని.. ఒకప్పుడు పెద్ద నగరాల్లో.. పట్టణాల్లో నా ఉనికి ఉండేది.. ఇప్పుడు పల్లెలకూ పాకాను.. పిల్లలు, యువకులే కాదు.. అమ్మాయిలూ నాకు దాసోహం అవుతున్నారు. ఇదే అదనుగా వారిని బానిసలుగా మార్చేస్తున్నాను. నా 'మత్తు'లో ముంచి.. విలువైన జీవితాలను చిత్తు చేస్తున్నాను.. అనారోగ్యం బారినపడి.. జైలుపాలైన వారి సంబంధీకులు నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు. ఇంతకూ నాలో ఏం ఉంటుందని అనుకుంటున్నారా..? మత్తును కలిగించే టెట్రా హైడ్రోకన్నాబినాల్ (టీహెచ్‌సీ) అనే రసాయన ప్రభావమే కారణం.. మైకంలో ముంచి.. విచక్షణ కోల్పోయేలా చేస్తాను.

నాకెన్నో రూపాలు : అక్రమార్కులు నన్ను అంగట్లో పెట్టి జేబులు నింపుకొంటున్నారు.. ఎండిన ఆకు రూపంలో విక్రయిస్తే పట్టుబడతామని నాకు యాష్ ఆయిల్, చాక్లెట్ల రూపాన్ని తీసుకొచ్చారు. నాకు భిన్నరూపాలు, మార్గాలు ఉండటంతో పోలీసులూ ఏం చేయలేకపోతున్నారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దు నుంచి భద్రాచలం మీదుగా ఉమ్మడి వరంగల్‌లో ప్రవేశిస్తున్నా.. మరి నన్ను తరిమికొడతారా..? దాసోహం అవుతారా..? అనేది మీ చేతుల్లోనే ఉంది.

ఇలాంటి దారుణాలెన్నో..!

ఈనాడు, మహబూబాబాద్ -న్యూస్‌టుడే, వరంగల్ క్రైం, కాటారం (భూపాలపల్లి జిల్లా)

● భూపాలపల్లి జిల్లా మహాముత్తారంలో ఇద్దరు యువకులు గంజాయికి బానిసై నేరాలు చేసేందుకు అలవాటుపడ్డారు. మత్తులో పలువురిపై దాడి చేయడంతో జైలు పాలయ్యారు. కుటుంబ సభ్యులు కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోయారు.

● ఇదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు గంజాయికి బానిసై మానసిక పరిస్థితి బాగోలేక పిచ్చిగా ప్రవర్తించేవాడు. కుటుంబ సభ్యులు మానసిక వైద్య నిపుణుడి వద్ద చికిత్స అందించారు. రూ.వేలల్లో ఖర్చయింది.

● భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని పేద కుటుంబానికి చెందిన కుమారుడు ఎదిగి ఆసరాగా ఉంటాడనుకుంటే గంజాయికి బానిసై.. రవాణా చేస్తుండగా.. ఇటీవల పోలీసులకు చిక్కి జైలుపాలయ్యాడు. కుటుంబం మానసిక క్షోభ అనుభవిస్తోంది.

ప్రభావం ఇలా..



గంజాయి మానవ శరీరంలోని వివిధ అవయవాలపై ప్రభావం చూపుతుందని భూపాలపల్లి వైద్య కళాశాల సూపరింటెండెంట్, ప్రొఫెసర్ డాక్టర్ కోడూరు నవీన్‌కుమార్ వివరించారు..

- **మెదడు :** తరచూ ఎక్కువ మోతాడులో తీసుకుంటే నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. పిచ్చిపిచ్చిగా ప్రవరిస్తుంటారు. తెలియని ఆతృత, భయం కలిగి ఉంటారు. ఇంద్రియాలు ఆధీనంలో ఉండవు.
- **దృష్టిలోపం :** అతిగా తీసుకోవడంతో కళ్లు ఎర్రగా కనిపిస్తాయి. దృష్టి లోపానికి గురయ్యే ప్రమాదం ఉంది.
- **గుండె :** హృదయ స్పందన రేటు, రక్త పోటు పెరుగుతుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువ.
- **ఊపిరితిత్తులు :** ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. శ్వాసకోశ సమస్యలు ఎదురవుతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంటుంది.

2024(ఇప్పటివరకు)లో పట్టుకున్న గంజాయి వివరాలు

వరంగల్ కమిషనరేట్	850.000	2,75,00,000	101
మహబూబాబాద్	485.198	1,21,43,325	20
భూపాలపల్లి	25.000	6,25,000	25
ములుగు	38.473	9,58,317	11

● పోలీస్ విభాగం ● పట్టుకున్న గంజాయి(కిలోల్లో)
● విలువ(రూ.లక్షల్లో) ● నమోదుచేసిన కేసులు

క్వింటాళ్లలో రాక..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు 2023లో రూ.4.14 కోట్ల విలువచేసే 20 క్వింటాళ్ల గంజాయి పట్టుకొని 103 కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి రూ.4.12 కోట్ల విలువైన 13 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం చేసుకొని 157 కేసులు నమోదు చేశారు. అత్యధికంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్ జిల్లాలోనే పట్టుబడింది.

నిరంతరం నిఘా..

- అంబర్ కిశోర్ ఝా, సీపీ, వరంగల్

గంజాయి రవాణా, సేవించడంపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంది. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. నిందితులకు శిక్షలు పడేలా సాక్ష్యాలను సేకరిస్తున్నాం. పదేపదే గంజాయి రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్టులను నమోదు చేస్తున్నాం.

ఈ మార్గం.. దుర్గంధభరితం

పున్నేలు, పంథిని శివారులో వరంగల్- ఖమ్మం ప్రధాన జాతీయ రహదారి పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను వదిలివెళ్తున్నారు. కొందరు హోటళ్ల నిర్వాహకులు, తోపుడు బండ్లపై టిఫిన్ అమ్ముతున్న చిరు వ్యాపారులు మిగిలిన ఆహార పదార్థాలను, మాంసం వ్యాపారులు వ్యర్థాలను ఇక్కడే పారబోస్తున్నారు. వాటి నుంచి దుర్గంధం వస్తుండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– న్యూస్‌టుడే, ఐనవోలు (హనుమకొండ)

నాలుగో లైను.. పనులు పరుగులు

ఒకప్పుడు రైలు పట్టాలు వేయాలంటే కార్మికులు నెలల తరపడి శ్రమించేవారు. ఇప్పుడు ఆధునిక యంత్రాలు రావడంతో పనులు పరుగులు పెడుతున్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి రోడ్డు నుంచి కాజీపేట ఎఫ్ క్యాబిన్ వరకు వేస్తున్న నాలుగో లైన్ పనులు చకచకా సాగుతున్నాయి. స్లీపర్లపై ముందుగానే పట్టాలు బిగించి, అత్యాధునిక క్రెయిన్-228ల సాయంతో తీసుకొచ్చి నిర్దేశిత స్థలంలో అమర్చుతున్నారు. ఎఫ్ క్యాబిన్ వద్ద ఆదివారం తీసిన చిత్రమిది.

– న్యూస్‌టుడే, కాజీపేట

పచ్చదనం విరిసింది.. ప్రకృతి మురిసింది

కనుచూపు మేర వరి పైరు. గుట్టకు పచ్చని రంగేసినట్లు చెట్లు. నేల నుంచి నింగి వరకు పచ్చదనం. ఆ ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. చూసేవారికి కనువిందు చేస్తోంది. ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పరిధిలో విస్తరించిన ఇనుప రాతి గుట్టల ప్రకృతి రమణీయత ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారులో తీసిన సుందర చిత్రమిది.

– ఈనాడు, హనుమకొండ

పాలాల్లో బడి.. రాకపోకలకు దారేది?

పాలం గట్టు మీద నుంచి వస్తున్న పిల్లలు

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాంధన్ తండా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు పొలం గట్లు, పత్తి చేన్లలో నుంచి వెళ్లాల్సి వస్తోంది. వ్యవసాయ భూముల మధ్యలో పాఠశాల ఉండటంతో ఆది నుంచి బడికి సరైన దారి లేదు. గతంలో స్థానికులు పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించగా.. ఒకసారి రోడ్డు వేసేందుకు కొలతలు తీసుకున్నారు. కానీ! స్థానిక రైతులు స్థలం సేకరించడానికి అంగీకరించకపోవడంతో ఏళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. పొలాల దారిలో రాకపోకలు సాగించేటప్పుడు అప్పుడప్పుడు పాములు, తేళ్లు కనిపిస్తున్నాయని పిల్లలు భయపడుతున్నట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. బడిలో 1 నుంచి 7వ తరగతి వరకు 18 మంది విద్యార్థులున్నారు. అంగన్‌వాడీ కేంద్రం సైతం ఇక్కడే ఉండటంతో గర్భిణులు, బాలింతలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, దసరా సెలవుల్లో రోడ్డు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, వర్ధన్నపేట

పండగ వేళ పారాహుషార్!

● గతేడాది వరంగల్‌కు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు వాట్సప్ ద్వారా వచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. తెలిచి చూడగా తక్కువ ధరకు ద్విచక్ర వాహనం విక్రయిస్తామని చెప్పి వాహన చిత్రాన్ని పెట్టాడు. మార్కెట్ దీని ధర రూ.75 వేలు ఉంటుంది. డబ్బులు అవసరం ఉందని కేవలం రూ.25 వేలకు ఇస్తానని చెప్పాడు. దీంతో ఉద్యోగి ఆన్‌లైన్ ద్వారా రూ.25 వేలు పంపించాడు. రెండురోజుల తర్వాత అడిగితే మరో రూ.10 వేలు పంపించాలని కోరాడు. అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తర్వాత చరవాణి స్విచ్ ఆఫ్ చేశాడు.

● హనుమకొండ జిల్లాకు చెందిన ప్రైవేటు ఉద్యోగినికి అలంకరణ వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని చెప్పి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సందేశం పంపించారు. తక్కువ ధరకు వస్తున్నాయని రూ.10 వేల విలువైనవి ఆర్డర్ చేశారు. తర్వాత చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. కొద్దిరోజుల తర్వాత పార్సిల్ వచ్చింది. తెరిచి చూడగా నాసిరకమైన వస్తువులు ఉన్నాయి.

న్యూస్‌టుడే, వరంగల్ క్రైం(వర్ధన్నపేట)

బతుకమ్మ, దసరా పండగల వేళ సైబర్ నేరగాళ్లు ఆఫర్ల ఎర వేసే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో తక్కువ ధరకే చరవాణులు, దుస్తులు, చేతి గడియారాలు అంటూ ఆకట్టుకునేలా ప్రకటనలు ఇస్తారు. ఆశపడి.. లింక్ క్లిక్ చేస్తే అంతే సంగతులు. ఇదంతా మోసం అని తెలునుకునే లోపు ఖాతాలోని నగదు మాయమవుతుంది.

అత్యాశకు పోతే అంతే సంగతులు..

ప్రముఖ కంపెనీలకు చెందిన లోగోలను అచ్చం వాటి మాదిరిగానే తయారు చేసి ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో లింక్‌లు పంపిస్తున్నారు. వాటి గురించి తెలియకుండానే అనేక మంది వాటిని ఇతరులకు పంపిస్తుంటారు. మార్కెట్ ధర కంటే 50శాతం నుంచి 75శాతం వరకు తగ్గింపు ధరలకు ఇస్తామంటూ.. వల వేస్తారు.

● ఉదాహరణకు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా.. అకస్మాత్తుగా ఒక ప్రకటన కనిపిస్తుంది. అందులో రూ.1500కే ఐఫోన్ అంటూ.. కింద ట్రైం నడుస్తూ ఉంటోంది. మరికొద్ది సేపట్లో ఈ ఆఫర్ ముగుస్తుందని రాసి ఉండటంతో.. మనం ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇంతలో లింకు తెరిచి.. యూపీఐ లేదా బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేస్తే. . అంతే సంగతులు. మనం తేరుకునేలోపే ఖాతా ఖాళీ అవుతుంది.

ఇలా చేస్తే సురక్షితం..

ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీలకు చెందిన వస్తువులను కొనుగోలు చేయాలనుకుంటే గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ఆప్ స్టోర్స్ నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కంపెనీలకు చెందిన అసలైన యాప్‌లు ఉంటాయి.

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ మోసాల వివరాలు (జనవరి 1 నుంచి సెప్టెంబరు 15 వరకు)

నమోదైన కేసులు	134
పోయిన డబ్బులు	7.85 కోట్లు
రికవరీ చేసిన నగదు	రూ. 95.25 లక్షలు

● ఆఫర్ల విషయంలో అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

ధర తక్కువంటే ఆలోచించాల్సిందే..

సైబర్ మోసగాళ్లు భారీ డిస్కౌంట్స్ ఇస్తామని చెప్పి యాప్‌ల ద్వారా ప్రచారం చేస్తారు. మార్కెట్‌లో ఐఫోన్- 16 ధర రూ.1 లక్షకు పైగా ఉంటే దానిపై 75శాతం వరకు డిస్కౌంట్ ఇస్తామని ప్రకటనలు ఇస్తారు. ఓ యాప్‌తో పాటు ఫోన్ చిత్రాన్ని అందుబాటులో ఉంచి డబ్బులు పంపించాలని సూచిస్తారు. తక్కువ ధరకు వస్తుందని యాప్ తెరిచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే మోసపోవడం ఖాయం.

1930కి ఫిర్యాదు చేయాలి..

- సైబర్ విభాగం ఏసీపీ కె.విజయ్‌కుమార్

మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు ఆన్‌లైన్‌లో వస్తువులు ఇస్తామంటే వాటిని ప్రజలు నమ్మొద్దు. సామాజిక మాధ్యమాల్లో లింక్‌ల ద్వారా వచ్చే యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేసుకోవద్దు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలి.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

జనగామ జిల్లా లింగాలఘనపురంలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

లింగాలఘనపురం, న్యూస్‌టుడే : 'బలహీన వర్గాల రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఉంది.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం తప్పకుండా కులగణన చేపడుతుంది.. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. లింగాలఘనపురంలో కేజీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, జిల్లా పాలనాధికారి రిజ్వాన్‌బాషా షేక్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ కులగణనపై నిన్నమొన్న కూడా చర్చలు జరిగాయన్నారు. గతంలో మాదిరి బలహీన వర్గాలకు అన్యాయం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు. జనగామ జిల్లాకు పేరు మార్పు నిర్ణయం ముఖ్యమంత్రి ఇప్పటికే చేశారన్నారు. శాసనసభ్యులం ముఖ్యమంత్రిని కలిసి జీవో వచ్చేలా చూస్తామన్నారు. దసరా పండగ లోపు గీత కార్మికుల బీమా బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకుంటున్నానని చెప్పారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనకు కట్టుబడి ఉందన్నారు.

చెక్‌డ్యామ్‌కు కోత.. మరమ్మతులు సాగదీత!

కోతకు గురైన ప్రాంతం నుంచి దిగువకు వృథాగా పోతున్న నీరు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: వర్ధన్నపేట, ఇల్లంద గ్రామాల మధ్య ఆకేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్ గతేడాది వచ్చిన వరదలకు కోతకు గురైంది. అప్పటి నుంచి మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైనుంచి వచ్చిన వరద వల్ల కోతకు గురైన ప్రాంతం మరింత పెరిగింది. దీంతో చెక్‌డ్యామ్‌లో చుక్కనీరు నిల్వ ఉండటం లేదు. కొన్నినెలల క్రితం చెక్ డ్యామ్ మరమ్మతులు చేయడానికి రూ.30 లక్షల నిధుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు చెక్‌డ్యామ్‌ను పరిశీలించి ప్రతిపాదనల్లో పనులకు సవరణలు సూచించారు. తాగునీటితో పాటు సాగుకు ఉపయోగపడే నీరు వృథా పోతుండటంతో రైతులు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానికుల డిమాండ్ మేరకు జడ్పీటీసీ మాజీ సభ్యుడు సారంగపాణి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ పనులను ఇటీవల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. కానీ! పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో నీటి వృథా కొనసాగుతోంది.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

స్కిన్‌కాప్	
ఫాం:	115
రిటైల్:	137
డ్రెస్:	199
స్కిన్‌లెస్:	226

రుణయాప్‌ల వేధింపులతో యువకుడి ఆత్మహత్య

అనిల్ (పాత చిత్రం)

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: రుణం చెల్లించాలంటూ యాప్‌ల నిర్వాహకుల వేధింపులతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకొంది. ఎస్ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామానికి చెందిన మాడుగుల అనిల్(29) డిగ్రీ వరకు చదువుకున్నారు. వివిధ యాప్‌లు, బ్యాంకుల ద్వారా సుమారు రూ.9 లక్షల వరకు అప్పులు చేసి, ఏడాది కిందట హనుమకొండలో మొబైల్ టిఫిన్ సెంటర్ ప్రారంభించారు. మొదట్లో వ్యాపారం బాగానే సాగినా తరవాత నష్టాలు రావడంతో మానేశాడు. రెండు నెలల కిందట స్వగ్రామంలోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రారంభించారు. వ్యాపారం అంతంత మాత్రంగా ఉండటం, అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇటీవల యాప్ నిర్వాహకులు అప్పు చెల్లించాలని వేధిస్తుండటంతో ఈ నెల 28న రాత్రి ములుకనూర్ రైతు వేదిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. యువకుడి తల్లి వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వాన లేకున్నా.. వరదొచ్చే..!

రెండురోజులుగా నగరంలో వర్షం పడలేదు. అయినా వరంగల్ అండర్‌బ్రిడ్జి కిందకి వరద వచ్చి చేరుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఎల్వీఆర్‌నగర్ గుడిసె వాసులకు చెందిన మురుగునీరు బ్రిడ్జి కిందకు వస్తోంది. దానికి తోడు తాగునీటి పైప్‌లైను లీకవడంతో బురదమయం అవుతోంది. ఇది చాలదన్నట్లుగా స్థానికంగా భవనం నిర్మిస్తున్న యజమాని భూగర్భ నీరంతా రోడ్డపైకి వదులుతున్నారు. బల్దియా అధికారులు స్పందించి బ్రిడ్జి కింద వరద నీరు రాకుండా చూడాలని అండర్ రైల్వేగేటు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శివనగర్

EENADU eClassifieds

BIRTHDAY GREETINGS

BEAUTY & PERSONAL CARE

BEAUTY PARLOUR

Maa mirrors salon Basic Beauty course only- 5000 Certification available. Address: Subedari, HNK. ✆ 9154400576, 6309415548.

WANTED

పార్లర్‌లో పనిచేయుటకు బ్యూటిషన్స్ కావలెను. & బోటిక్ నందు పనిచేయుటకు కటింగ్ మాస్టర్ కావలెను. సంప్రదింపుట 9182900152, 9963886324.

EDUCATION

Software ట్రైనింగ్- కెరీర్ గైడెన్స్+ లైవ్ ప్రాజెక్ట్+ Internship ఈ నాలుగు కలిపి ఆఫర్ చేస్తుంది. మన Lifeboat Technologies. Python, ఆండ్రాయిడ్, iOS, వెబ్ ఇలా ఏదైనా మన Hanamkonda లో. Call +91 9182259795.

PROFESSIONAL SERVICES

కస్టమర్ల్టీన్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

JOBS

వరంగల్, ఆటోనగర్ అమరాన్ బ్యాటరీస్/ స్పేర్స్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మేనేజర్ కావలెను. సంప్రః 9393442215, 26

ఆత్మకూర్ మండలం గుడెపాడు నర్సరీ ప్రక్షన GK Mess (మన వరి వంట)లో పనిచేయుటకు అనుభవం గల వంట మనుషులు (భార్యభర్తలకు ప్రాముఖ్యత) వెంటనే కావలెను. (అన్ని రకాల వంటలు టిఫిన్‌తో). cell: 9989149799.

ప్రముఖ ఆడిట్ కంపెనీలో పనిచేయుటకు లేడీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ & ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం ఇవ్వబడును. ✆ 8790207439.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ షేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. ✆ 91609 00024, 96404 00073.

కస్టమర్ల్టీన్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. 9182260297.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BUSINESS SERVICES

BUSINESS OFFER

నాటుకోళ్ల పెంపకంలో మంచి అనుభవముండి శాస్త్రీయ పద్ధతిలో పెంచుతున్న నాటుకోళ్ల వ్యాపార పట్ల ఆసక్తి కలవారు సంప్రః ✆ 7993945852.

SAREES

మావర్ధ కంచి, ఆరతి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు చీరలు & వెనారస్, కలకత్తా, సూరత్ ఫ్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. ✆ 7396099834.

ASTROLOGY

శ్రీ సుముఖ సారస్వత జ్యోతిష్యాలయం గురూజీ సంజీవరాజు, భార్యాభర్తల సమస్య, ప్రేమ, పెళ్లి, ఉద్యోగ, వ్యాపార, రియల్‌ఎస్టేట్, విదేశీయానం. కొత్త ఇన్‌స్టాల్, హన్మకొండ. Ph: 9640454540

REAL ESTATE

PLOT FOR SALE

టీమారం to చింతగట్టు Main Road Facing 333 గజాల ప్లాట్ అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: సెల్: 9700721870.

(c) eenadu

రహదారి నిర్మాణంలో కొరవడిన నాణ్యత

కొత్తపల్లి శివారులో తారు లేచి తేలిన కంకర

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: ఎన్‌హెచ్‌-765డీజీలో భాగంగా సిద్దిపేట పట్టణం రంగధాంపల్లి వంతెన నుంచి ఎల్కతుర్తి వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. ఎల్కతుర్తి నుంచి ములుకనూర్‌ వరకు ఏడు కిలోమీటర్ల పనులు ఏడాది క్రితం ముమ్మరంగా సాగడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషపడ్డారు. రహదారి పనులు పూర్తికాకముందే మొదట వేసిన తారు లేచి పోయి గుంతలు పడుతోంది. ప్యాచ్‌వర్క్‌ చేయించినా మళ్లీ ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల కంకర తేలి రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఏడు కిలోమీటర్ల పరిధిలో 70కి పైగా గుంతలు పడ్డాయి. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని ఇటీవల సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏడాది తిరగకముందే రోడ్డు ధ్వంసం అవుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మురుగు గుంతతో అపరిశుభ్రత

నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగిపోయి డెంగీ వంటి జ్వరాలు వస్తాయని మున్సిపాలిటీ అధికారులు ప్రచారం చేస్తున్నారు. పరకాల కార్యాలయం వెనుకాల ఉన్న మురుగు గుంతను మాత్రం పట్టించుకోవడంలేదు. రూ. 5 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనంలోకి కార్యాలయం మారింది. సెప్టిక్‌ ట్యాంక్‌ వద్ద పెద్ద గుంత ఏర్పడగా పూడ్చడం లేదు. దోమల నివారణ చర్యలు చేపట్టలేదని ప్రజలు తెలిపారు.

– న్యూస్‌టుడే, పరకాల

రహదారిపై దుర్గంధం

హనుమకొండలోని 4వ డివిజన్‌ పెద్దమ్మ గడ్డ ప్రధాన రహదారి బొల్లం టవర్స్‌ దగ్గర మురుగు రోడ్డు పైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. కాల్వల్లో వేస్తున్న వ్యర్థాలు మురుగు ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు సరిగా కాల్వలను తీయక పోవడం కూడా సమస్యకు కారణమవుతోంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై మురుగును తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
జులైవాడ 9059585150
బాలసముద్రం 81438 11118
పరకాల 9849211303

న్యూశాయంపేట, న్యూస్‌టుడే: నగరంలోని 31వ డివిజన్‌ న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో కాల్వలు లేక మురుగు రోడ్లపై పారుతోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - **పెరుగు సురేష్‌, న్యూశాయంపేట**

సమాధానం: పరిశీలించి వెంటనే చర్యలు చేపడతాం.
- **పెండెల అనిల్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌**

చేతిపంపులకు మరమ్మతులు

శాయంపేట, న్యూస్‌టుడే: శాయంపేట మండలం గోవిందాపూర్‌లోని 3, 4, 7వ వార్డుల్లో మూడు చేతి పంపులు పాడైపోయాయి. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ దృష్టికి తీసుకెళ్లగా మెకానిక్‌తో చేతిపంపులను బాగు చేయించారు.

అరకొర పనులు.. ప్రాణాలకు ముప్పు

వరద ముంపు నివారణకు నగరంలోని పలు నాలాలు విస్తరించారు. మరికొన్ని పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. హనుమకొండలోని విష్ణుపురి కాలనీ సమీపంలో చేపట్టిన వదర నీటి కాల్వ పనులు అరకొరగా చేసి వదిలేశారు. ప్రస్తుతం అందులో నీళ్లు నిలిచి ప్రమాదకరంగా ఉంది. అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు

– ఈనాడు,హనుమకొండ

మస్తాన్‌బాబా జాతర ప్రారంభం

చాదర్‌ సమర్పిస్తున్న దర్గా పీఠాధిపతి మహమ్మద్‌ అబ్దుల్‌ హమీద్‌ సైలానిబాబా

దామెర, న్యూస్‌టుడే: ఒగ్లాపూర్‌లోని సైలాని బాబా దర్గాలో ఆదివారం మస్తాన్‌బాబా గంధం జాతర ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పీఠాధిపతి మహమ్మద్‌ అబ్దుల్‌ హమీద్‌ సైలానిబాబా ఇంటి నుంచి గుర్రంపై గంధం తీసుకొచ్చి మస్తాన్‌బాబాకు సమర్పించారు. దర్గా పీఠాధిపతి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం ఖవ్వాలి కార్యక్రమంతో జాతర పూర్తవుతుందన్నారు. పరకాల రూరల్‌ సీఐ రంజిత్‌రావు, దామెర ఎస్సై అశోక్‌ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. రషీద్‌బాబా, ఎస్కే మొయిన్‌, సయ్యద్‌ మసూద్‌ పాషా, పోతుల కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ ఎంపిక పోటీలు

వరంగల్‌ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో చేపట్టిన ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ(రెజ్లింగ్‌) ఎంపిక పోటీలు ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్‌ నెహ్రూ ఇండోర్‌ స్టేడియంలో జరిగాయి. అండర్‌-14, 17 విభాగంలో జరిగిన పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన 120 బాలబాలికలు హాజరయ్యారు. ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ జిల్లా ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి దస్రునాయక్‌, తెలంగాణ అమెచ్యూర్‌ రెజ్లింగ్‌ సంఘం కార్యదర్శి మహ్మద్‌ కరీం, డీఎస్‌ఏ కోచ్‌ రాజు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రవీందర్‌, జ్యోతి, ముఖర్జీ, లావణ్య, సుజాత పాల్గొన్నారు.

నాలా పూర్తయినా.. ప్రయాణికులపై భారమేనా?

ఏటా వర్షాకాలం పలు కాలనీలను వరదలతో ముంచెత్తుతున్న నయీంనగర్‌ నలాపై కొత్త వంతెన నిర్మాణం పూర్తయింది. అయిదు దశాబ్దాలుగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. స్మార్ట్‌సిటీ పథకం నిధులు రూ.7.40 కోట్లతో ఏప్రిల్‌ 5న పనులకు శ్రీకారం చుట్టి.. కొంత ఆలస్యంగా అయినా ఆధునిక హంగులతో పూర్తి చేశారు. ఈ నెల 9న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల ఆగిపోయింది. ప్రస్తుతం వాహనాలు తిరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సులను మాత్రం అనుమతించకపోవడంతో కరీంనగర్‌ నుంచి వచ్చేవి కేయూ కూడలి నుంచి హనుమాన్‌నగర్‌, పెద్దమ్మ గడ్డ, ములుగు రోడ్డు కూడలి మీదుగా బస్టాండ్‌కు వెళ్తున్నాయి. దీనికి ప్రయాణికుల నుంచి అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నయీంనగర్‌

'కేటీఆర్‌ ఓరుగల్లుకు వచ్చి మాట్లాడాలి'

నయీంనగర్‌ నాలా వద్ద ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్‌, న్యూస్‌టుడే: భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు దమ్ముంటే ఓరుగల్లుకు వచ్చి మాట్లాడాలని, తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధిని చూపిస్తామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. సవాల్‌ విసరడం కాదని, దానికి కట్టుబడి ఉండాలని హితవు పలికారు. నయీంనగర్‌ నాలాపై వంతెన అభివృద్ధి భారాస ప్రభుత్వం చేపట్టిందని ఇటీవల కేటీఆర్‌ అనడంతో ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. ఆదివారం ఎమ్మెల్యేతో పాటు టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్‌, కార్పొరేటర్లు, సీనియర్‌ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో నాలా వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. అంటే భారాస నేతలకు లాగులు తడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. కమీషన్ల కక్కుర్తితో కాళోజీ క్షేత్రం నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించి పూర్తి చేసిన ఘనత తమదన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలు బంక సరళా యాదవ్‌ ఆధ్వర్యంలో మహిళలు వినూత్న నిరసన తెలిపారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే : నగరంలోని 10వ డివిజన్‌ కాపువాడలో గునిశెట్టి సమ్మయ్య, ఎల్లమ్మల జ్ఞాపకార్థం భద్రకాళి చెరువు మత్తడి ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం అదే ఆవరణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగరపాలక సంస్థ ఫ్లోర్‌లీడర్‌ తోట వెంకటేశ్వర్లు, నాయకులు కుమార్‌ యాదవ్‌, మాడిశెట్టి రాజు, రమేష్‌, రామకృష్ణ, యాదగిరి, సుధాకర్‌, సమ్మయ్య, విగ్రహదాత గునిశెట్టి సుధాకర్‌, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితోనే గుండె జబ్బులు

కేఎంసీలో కేకు కోస్తున్న ఎండీఎం సూపరింటెండెంట్‌ డా.మురళి, ప్రిన్సిపల్‌ డా.రాంకుమార్‌రెడ్డి, కార్డియాలజీ వైద్యులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: గుండె సంబంధిత వ్యాధుల బారినపడకుండా జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డా.చిలుక మురళి పేర్కొన్నారు. ఆదివారం కేఎంసీ(కాకతీయ వైద్య కళాశాల)లోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగాధిపతి డా.మమతారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ హృదయ దినోత్సవంలో ప్రిన్సిపల్‌ డా.రాంకుమార్‌రెడ్డితో కలిసి ఆయన కేకు కోశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ డా.మురళి మాట్లాడుతూ.. ఒత్తిడితో కూడిన జీవనం వల్లే గుండె జబ్బులు వస్తున్నాయన్నారు. నిత్య జీవితంలో వ్యాయామం, స్ట్రెచింగ్‌, ధ్యానం వంటి అలవాట్లు చేసుకోవాలన్నారు. కార్డియాలజీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డా.రాంరెడ్డి, వైద్యులు డా.సృజన్‌, డా.రితీష్‌, ఆర్‌ఎంవో డా.రోషన్‌, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరా వింగ్‌ అధికారి?

కార్పొరేషన్‌, న్యూస్‌టుడే: గ్రేటర్‌ వరంగల్‌లో ఓ వింగ్‌ అధికారి హవా నడుస్తోంది. ఇతర విభాగాల్లో తల దూర్చి కొందరు అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారి వద్ద ఏ పనైనా చేయిస్తానని సదరు వింగ్‌ అధికారి చెబుతున్నట్లుగా తెలిసింది. అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల్లో కీలకపాత్ర వహిస్తున్నారని కొందరు సివిల్‌ గుత్తేదారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా కొత్తగా కొనుగోలు చేయాలనుకుంటున్న వాహనాల ఏజెన్సీలతో ముందస్తుగానే పర్సంటేజీల విషయం మాట్లాడినట్లు తెలిసింది. ఎవరా వింగ్‌ అధికారి, ఏయే విభాగాల్లో చక్రం తిప్పుతున్నారనే దానిపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

సీపీఆర్‌పై అవగాహన

విద్యానగర్‌, న్యూస్‌టుడే: ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హనుమకొండలోని ఏకశిల హాస్పిటల్‌ ఆధ్వర్యంలో ఛాతీ మర్దన (సీపీఆర్‌)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌ ముందు కార్యక్రమం చేపట్టారు. గుండెపోటు వచ్చి పడిపోయిన వారిని రక్షించే పద్ధతి గురించి వైద్య నిపుణులు వివరించారు. తక్షణం చేయాల్సిన సీపీఆర్‌ విధానం గురించి అవగాహన కల్పించారు. గుండెపోటు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ చైర్మన్‌ కర్ణాకర్‌రెడ్డి, వైద్యులు ఇక్బాల్‌, సంతోష్‌, అనిల్‌, లావణ్య, అనూష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

దామెర, న్యూస్‌టుడే: దామెర మండలం పులుకుర్తి శివారులోని చంద్రగిరిగుట్టల్లో గుప్తనిధుల కోసం ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టారు. తవ్వకాల్లో అమ్మవారి రాతి విగ్రహంతోపాటు, పానవట్టం లభ్యమయ్యాయి. కంప్రెషర్‌ సాయంతో బండరాళ్లను పగలగొట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. చికెన్‌, మాంసం వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలు, ఇతర వస్తువులు ఆ ప్రదేశంలో కనిపించాయి. బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

దొడ్డి కొమురయ్యపై సినిమా నిర్మాణం

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నిజాం కాలంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య చరిత్రతో సినిమా నిర్మిస్తున్నామని దర్శకుడు సేనాపతి అన్నారు. ఆదివారం నగరంలోని జగదీష్‌బాబు ఆసుపత్రిలో సినిమా నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం సినిమాలో నటించేందుకు నటీనటులను, డ్యాన్సర్లను, గాయకులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో సాగంటి మంజుల, రఘుపతి, రావుల సురేష్‌ శ్రీమన్నారాయణ, రహమున్నీసా బేగం, స్వామి సదానందం పాల్గొన్నారు.

కాకతీయుల శిల్పసంపద భావితరాలకు అందించాలి

స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న జడ్జి శాలిని లింగం

గణపురం, న్యూస్‌టుడే: కాకతీయుల కట్టడం గణపురం కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతంగా ఉందని వీటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరకాల కోర్టు జూనియర్‌ సివిల్‌ జడ్జి శాలిని లింగం అన్నారు. ఆదివారం పరకాల కోర్టు ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. కోటగుళ్లను మొదటిసారి సందర్శించినట్లు తెలిపారు. ఆలయాలు ఎంతో విశాలంగా రామప్పను పోలి ఉన్నాయన్నారు. జడ్జి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

కాజీపేట టౌన్‌, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్‌ వై.సుధాకర్‌రెడ్డి తెలిపారు. మడికొండ ఇందిరమ్మ కాలనీకి చెందిన మ్యాదరి వేణుతో భార్య చైతన్య శనివారం గొడవపడి పుట్టింటికి వెళ్తానంది. దీంతో వేణు ఆమెను సోమిడిలోని పుట్టింట్లో దిగబెట్టి వెళ్లారు. మరుసటి రోజు వారి కుమారుడు అమ్మమ్మకు ఫోన్‌చేసి తల్లి గురించి వాకబు చేయగా, మీ నాన్న వచ్చి వదిలిన అరగంటకే ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో తెలిసినవారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నిత్యావసరాల ధరలను అరికట్టండి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి

ఐనవోలు, న్యూస్‌టుడే: పెరుగుతున్న నిత్యావసరాల ధరలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్‌ చేశారు. ఆదివారం వెంకటాపూర్‌లో నిర్వహించిన పార్టీ గ్రామ మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడంతో కాంగ్రెస్‌ విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శి లింగయ్య, నాయకులు ఉప్పలయ్య, పోచమ్మ, నారాయణ, సరోజన, యాకుబు, సంపత్‌, యాకయ్య, కవిత, మనెమ్మ, రాజు, నర్సయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మడికొండ: మడికొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరం

పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సోమిడిరెడ్డి, మదన్‌మోహన్‌, స్నేహలత, సింహపురి భాస్కర్‌, పుల్యానాయక్‌లను ఘనంగా సత్కరించారు.

'విద్యారంగ కాషాయీకరణకు కుట్ర'

న్యూశాయంపేట: భాజపా ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణకు కుట్ర పన్నుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్న అప్పారావు ఆరోపించారు. హంటర్‌రోడ్డులోని ఓ కళాశాలలో ఆదివారం పీడీఎస్‌యూ వరంగల్‌, హనుమకొండ జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలహీనపరిచి ప్రైవేటు, కార్పొరేట్‌ సంస్థలకు పెద్దపీట వేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.7వేల కోట్లకు పైగా ఉపకార వేతనాలు బకాయి ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుత్రపు అనిల్‌, మిశ్రీన సుల్తాన, రాచకొండ రంజిత్‌కుమార్‌, మహేష్‌, వంశీ, అర్జున్‌, ముషారఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మృతి.. నేత్రాలు దానం

పెద్దపెండ్యాల(ధర్మసాగర్‌): మండలంలోని పెద్దపెండ్యాలకు చెందిన పోమ జగదీశ్వర్‌ ఆదివారం గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మృతి చెందగా.. ఆయన నేత్రాలను దానం చేసినట్లు తెలంగాణ నేత్ర, అవయవ శరీర దాతల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. జగదీశ్వర్‌ మృతి చెందిన వెంటనే కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో భార్య జమున, కుమారులు, కుమార్తెలు నేత్ర దానానికి అంగీకరించారన్నారు.

సంక్షిప్తంగా

నిత్యం ట్రాఫిక్‌ సమస్య

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం భీమారంలోని ఎర్రగట్టుగుట్ట కూడలిలో నిత్యం ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతోంది. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4నుంచి 7గంటల వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. గత కొన్నేళ్లుగా ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఉదయం కిట్స్‌ కళాశాలకు వెళ్లే వేల మంది విద్యార్థులతో పాటు పెంబర్తి, కమలాపూర్‌, పరకాల, భూపాలపల్లి, హుజూరాబాద్‌, కరీంనగర్‌ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్‌ వాహనాల కోసం కూడలికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అధికారులు స్పందించి పోలీసును ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ పోలీసులకు బాడీవార్న్‌ కెమెరాలు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్‌ నగరంలో ట్రాఫిక్‌ తనిఖీలతో పాటు పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించేందుకు బాడీవార్న్‌ కెమెరాలను అందించారు. ఆదివారం హనుమకొండలోని తన కార్యాలయంలో వాటిని ట్రాఫిక్‌ ఏసీపీ సత్యనారాయణ సిబ్బందికి అందజేశారు. డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీ సమయంలో ఎదురయ్యే దాడులను నియంత్రించేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. పోలీస్‌శాఖ ప్రధాన కార్యాలయం నుంచి వరంగల్‌ కమిషనరేట్‌లో మూడు ట్రాఫిక్‌ ఠాణాల మూడు చొప్పున 9 కెమెరాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్లు షుకూర్‌, నాగబాబు, రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

'గాయమెరుగని సముద్రం' పుస్తకావిష్కరణ

ఎన్టీమోస్‌కాలనీ, న్యూస్‌టుడే: కవి, రచయిత గన్నోజు ప్రసాద్‌ రచించిన 'గాయమెరుగని సముద్రం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం వడ్డేపల్లిలో జాతీయ సాహిత్య పరిషత్‌ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ గన్నమరాజు గిరిజా మనోహర్‌బాబు, డీఎన్‌ఆర్‌ విద్యాట్రస్ట్‌ వ్యవస్థాపకుడు దొడ్డ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. సమాజ శ్రేయస్సును ఆకాంక్షించే గొప్పతనాన్ని పుస్తకంలో పొందుపర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం పుస్తకాన్ని గన్నోజు రాజశేఖరం పీరమ్మకు అంకితం చేశారు.

చెట్టుపై నుంచి పడి ఒకరి మృతి

వేలేరు, న్యూస్‌టుడే: చెట్టుపైనుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్‌ఐ సురేష్‌ కథనం ప్రకారం. .వేలేరుకు చెందిన సూత్రపు కనకయ్య (60) ఈ నెల 15న పూజ కోసమని మోదుగ చెట్టు ఎక్కి ఆకులు, పూలు తెంపుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా.. ఆదివారం మృతి చెందారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి..

దామెర, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన దామెర పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాజుపల్లికి చెందిన ఉప్పుల లక్ష్మీనారాయణ(79) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న వరి పంటకు గడ్డి మందు పిచికారీ చేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. మృతుడి కుమారుడు శంకర్‌ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మొరం లారీల అడ్డగింత

ధర్మసాగర్‌, న్యూస్‌టుడే: మల్లక్‌పల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న లారీలను గ్రామస్థులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. ఏడాది నుంచి మొరాన్ని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలను అడ్డుకొని డయల్‌ 100కు ఫోన్‌ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చాక అప్పజెప్పారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియపర్చునది ఏమనగా నా కక్షిదారులు 1. పరీదార్‌ జస్టీసింగ్‌ భాటియ మరియు 2. పరీదార్‌ తనీమీసింగ్‌ భాటియ ఇద్దరి S/o. పరీదార్‌ అమర్‌జీతసింగ్‌ భాటియ ఇద్దరు S/o. పరీదార్‌ R/o. H.No: 11-27-56/1, పోచమ్మ మైదాన్‌, వరంగల్లు గారు శ్రీ సయ్యద్‌ మాజిద్‌ మరియు సయ్యద్‌ ముజాహిద్‌ ఇద్దరు S/o.సయ్యద్‌ ముసీర్‌, ఇద్దరు ప్రైవేట్‌ ఉద్యోగస్తులు ఇద్దరు R/o. H.No: 5-2-317, ఈద్గా, హన్మకొండ గార్ల వద్ద నుండి వారికి చెందిన ఫ్లెక్సాలు దాఖల ఉన్నిని క్రయము చేయటంలో అగ్రిమెంట్‌ చేసుకొని కొంత మొత్తమును అడ్వాన్సు రూపేణ చెల్లించి యున్నారు. సదరు ఆస్తిపై ఎవరికైనను హక్కు లున్నచో లేదా నా క్షక్షిదారులు సదరు ఆస్తిని క్రయము చేయుటకు అభ్యంతరములు ఉన్నచో ఈ నోటీసు ప్రచురణమగు నాకు తెలుపగలరు. లేనిచో సదరు ఆస్తిని ఎటువంటి హక్కు లేవని భావించి నా క్షక్షిదారులు మీగిలిన విక్రయ ధనము అమ్మిన వారికి చెల్లించి విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్‌ చేయించుకొందుట తదుపరి ఎటువంటి అభ్యంతరములు చెల్లనేరవు.

షెడ్యూల్‌

హన్మకొండ జిల్లా, హన్మకొండ పట్టణము, రుజ్జు వాకలో ఉన్న H.No: